పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల కోసం పాపన్నగౌడ్ చేసిన త్యాగాలు, సేవలను ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, రవిప్రసాద్‌గౌడ్, నాగేశ్వరరెడ్డి, రాజేశ్వరరావు, రాజేష్‌నాయర్, ఈఎల్ ప్రతాప్, సతీష్‌రాజ్, కృష్ణగౌడ్, మురళీమోహన్, సురేందర్, సంపత్ పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో సంఘం వర్కింగ్ స్వామి గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పాపన్న చిత్రపటానికి నివాళి అర్పించారు. ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేసి జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంసా అధ్యక్షులు నామ సైదులు, రాజేందర్, ఆనంద్, పండరి, బద్రీ, రవీందర్, నాగార్జున్ పాల్గొన్నారు.

ప్రభుత్వం రక్షణ కల్పించాలి

శ్రీనగర్‌కాలనీ: తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, పోలీసులు, ప్రభుత్వమే తమను రక్షించాలని ఆగ్రా స్వీట్స్ యజమాని కుమార్తె అనామికా ఘోష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జయప్రకాష్‌నగర్‌లోని ఆగ్రాస్వీట్ హౌస్ వద్ద ఆమె తన తల్లి బసుమతి ఘోష్‌తో కలిసి మాట్లాడుతూ.. తన తండ్రి అజిత్ ఘోష్ మరణించిన తర్వాత దినేష్ కచ్వా తమ ఇంట్లోని డాక్యుమెంట్స్‌ని దొంగిలించి నకిలీ పత్రాలను సృష్టించి తమ ఆధీనంలోని షాప్స్‌ని స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. లైసెన్స్‌తో పాటు న్యాయం తమవైపు ఉండటంతో కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, షాప్స్ తాము స్వాధీనం చేసుకున్న తర్వాత తమకు బెదిరింపు కాల్స్‌తో పాటు తమ దగ్గరికి వచ్చి చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయమై బోరబండ, మధురానగర్, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ఇప్పటి వరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పించి, న్యాయం వైపు నిలబడాలని కోరారు.



రోడ్డుపై మట్టికుప్పలు..
రాకపోకలకు ఇబ్బందులు

- నెలల తరబడి తరలించని వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- విస్మరిస్తున్న అధికారులు

బౌద్ధనగర్: రోడ్డు నిర్మాణం కోసం తొలగించిన మట్టికుప్పలు, వ్యర్థాలను తరలించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని కనకదుర్గ ఆలయం వద్ద సీసీ రోడ్డు వేసిన అధికారులు వ్యర్థాలను తొలగించకుండా నెలల తరబడి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న మట్టి కుప్పలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపై నెలల తరబడి పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించాలని బస్తీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని పాట్లు

కనకదుర్గ దేవాలయం సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మట్టి కుప్పలను దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. కొందరు విద్యార్థులు వాటిని దాటలేక కిందపడి గాయాలకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానికంగా సీసీ రోడ్డు వేసిన అధికారులు అందులో నుంచి వెలువడిన మట్టి వ్యర్థాలను ప్రధాన రోడ్డు మార్గాన వదిలేసి వెళ్లడంతో సమీప ప్రాంతాల్లో ఉన్నటువంటి నివాసితులు వాహనాలపై తమ ఇళ్లకు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో పక్క వీధుల్లో వాహనాలను పార్క్ చేసి వెళ్తున్నారు. దీంతో తమ వాహనాల్లోని పెట్రోల్, బ్యాటరీలు దొంగతనాలకు గురవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

ఆందోళన చేస్తాం..

కనకదుర్గ దేవాలయం ముందు ఎన్నో రోజులుగా పేరుకుపోయి వాహనాలు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం సృష్టిస్తున్న మట్టికుప్పలను తొలగించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని ఇప్పటికైనా మట్టి కుప్పలను తరలించకుంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

ఖమ్మంలో వర్సిటీని ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆ జిల్లాకు చెందిన ఓయూ అధ్యాపకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్‌లో జరిగిన సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ పోరాట సమితిని ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికభాగం ఏజెన్సీ ప్రాంతం అయినందున ఉన్నత విద్యలో వెనుకబడి ఉందన్నారు. వర్సిటీ ఏర్పాటుతో వెనుకబడిన వర్గాలు, ఆదివాసులు, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, ఎ.నాగేశ్వర్ రావు, రీసెర్చ్ స్కాలర్ నాగేశ్వర్ రావు, వంశీధర్, అనురాధ పాల్గొన్నారు.

పేను ప్రభావిత సమస్యలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో చిన్నారులు

సనత్‌నగర్: పేను ప్రభావంతో పిల్లల్లో ఉత్పన్నమయ్యే సమస్యలపై బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి మాట్లాడుతూ.. మెడికర్‌కు చెందిన హెయిర్ హైజీన్ మిషన్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 300 పాఠశాలల్లో మూడున్నర లక్షల మంది విద్యార్థులకు పేను సమస్య పరిష్కారాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ అండ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ అమూల్య మైసూర్ మాట్లాడుతూ.. తలలో పేనులు ఉండడం వల్ల పిల్లలు అసౌకర్యానికి గురవుతుంటారన్నారు. వేప, కొబ్బరి వంటి సహజ పదార్థాలు పేను సమస్యను పరిష్కరించడంలో దోహదం చేస్తాయన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు వెన్నంటే అవకాశాలు



కాచిగూడ: ప్రతిభ గల విద్యార్థులకు అవకాశాలు వెన్నంటే ఉంటాయని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ డాక్టర్ చంద్రుడు చిలుకూరు అన్నారు. మంగళవారం నారాయణగూడలోని శ్రీ వేంకటేశ్వర కామర్స్ డిగ్రీ కాలేజీలో 'వాణిజ్య శాస్త్రం – ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కామర్స్ డిగ్రీ కాలేజేస్ చైర్మన్ పమ్మి సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పారిశ్రామికీకరణతో కామర్స్ విద్యార్థులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతుందని డాక్టర్ చంద్రుడు వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి అవసరమయ్యే స్కిల్స్‌ను విద్యార్థులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. కేవలం పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా నేర్చుకోవాలన్నారు. ఉపాధి వెతుక్కోకుండా 10 మందికి ఉపాధిని ఇచ్చేలా విద్యార్థులు అవకాశాలను సృష్టించాలన్నారు. డాక్టర్ ఎస్ సూర్యప్రకాష్, కృష్ణారెడ్డి, గీతారామ్, రాగినీసింగ్, సీహెచ్ సావిత్రి, అనుపమ, సీహెచ్ అపర్ణ, రమణాచారి, ప్రియాంక, తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ సందేహాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

6న 'పాటపై తూటా' సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ప్రజా గాయకుడు గద్దర్ పై కాల్పులు జరిపి 27 ఏళ్లు పూర్తయినా ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే పాటపై తూటా సమావేశం విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కొడుకు సూర్యకిరణ్, ఓయూ అధ్యాపకులు డాక్టర్ పరుశురామ్, డాక్టర్ ప్రేమయ్య, బాలకోటి, రవికుమార్, వినీతపాండే పాల్గొన్నారు.

మాదిగలకు టికెట్ ఇవ్వని పార్టీలను తిరగనివ్వం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిగలకు టికెట్ ఇవ్వని పార్టీలను తరిమికొడతామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఎస్సీలలో 70 శాతం ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ టికెట్ కూడా ఇవ్వలేదన్నారు. కనీసం కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనైనా మాదిగ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలన్నారు. కంటోన్మెంట్‌లోనూ అధిక సంఖ్యలో ఉన్న మాదిగల పట్ల ప్రధాన రాజకీయ పక్షాలు వివక్ష చూపుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మాదిగలకు టికెట్ ఇవ్వని పార్టీలను కంటోన్మెంట్‌లో తిరుగనివ్వమన్నారు. బుధవారం బోయిన్‌పల్లి వియాండ్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించే 'మాదిగల సింహ గర్జన'లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో అజిత్ కల్యాణ్, ఇటుక గోపి, విజయ రామరాజు, శంకర్, సునీల్, రాజేందర్, ఉత్తరయ్య పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో నివేదిత



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నివేదిత, అనిత ప్రభాకర్



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం కార్ఖానలో జామా మసీదు సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నివేదిత ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఫారుఖ్, నిత్యానంద్, త్యాగరాజు, దర్శన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమరానికి సమాయత్తం



శిక్షణకు హాజరైన అధికారులు

పీఓ, ఏపీఓలకు శిక్షణ

సనత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం సమాయత్తమవుతుంది. ఈ దిశగా ఎన్నికల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్న ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ)కు శిక్షణ మొదలైంది. ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులపై రెండు రోజుల పాటు పీఓ, ఏపీఓలకు సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ కళాశాలలో అవగాహన కల్పించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని సనత్‌నగర్ అసెంబ్లీ పరిధితో పాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓలు ఇందులో పాల్గొనగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పోలింగ్ బూత్‌లకు సామాగ్రి చేరవేసిన దగ్గర నుంచి ఎన్నికల నిర్వహణ గురించి మాస్టర్ ట్రైనర్లు వివరించారు. పీఓ, ఏపీఓలకు పోలింగ్ కేంద్రాలను కేటాయించే ప్రక్రియ, పోలింగ్ ముందు రోజు ఈవీఎం, వీవీ ప్యాట్లను ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించే పద్ధతిని ఈ శిక్షణలో తెలియజేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 97 లోకేషన్లలో 229 పోలింగ్ బూత్‌లు ఉండగా ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి ఎన్నికల విధులు నిర్వహిస్తారు. ఇందుకోసం 229 పీఓలు, 299 ఏపీఓలతో మరికొంత మందిని అదనంగా నియమిస్తారు.

ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన..

పోలింగ్ రోజు నిర్వహించే విధుల పట్ల ముఖ్యంగా ఈవీఎం యంత్రాల పనితీరు పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మాస్టర్ ట్రైనర్లు సూచిస్తున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్‌బుక్‌లో సూచించిన విధంగా మొత్తం పోలింగ్ సామగ్రిని సేకరించుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు మాక్‌పోల్ నిర్వహించాలని, మాక్‌పోల్ సమయంలో కనీసం 50 ఓట్లు వేయాలని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఆ రోజు పోలింగ్ విధుల్లో ఉండడం వల్ల సిబ్బంది ఓటు వేయలేని పరిస్థితి ఉండడంతో వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల అందజేత

సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను పంపిణీ చేశారు. సంబంధిత సిబ్బంది ఏ నియోజకవర్గం పరిధికి వస్తారో ఆ వివరాలను దరఖాస్తుల్లో భర్తీ చేసి అధికారులకు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సికింద్రాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, హెచ్‌ఎండీఏ ఎస్టేట్ అధికారి వీరారెడ్డి హాజరై పీఓ, ఏపీఓలకు సూచనలు చేశారు. ప్రశాంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల నిర్వహణలో వీరు ఇక్కడ తీసుకున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒకవేళ ఈవీఎంలు, వీవీ ప్యాట్లలో లోపాలు తలెత్తితే ఏ విధంగా వ్యవహరించాలో మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణలో నేర్పిస్తారని చెప్పారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 16, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 31, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ఐఎఫ్‌టీయూ నేత కిరణ్‌కు ఓయూ హాస్టల్ కాంట్రాక్టు ఉద్యోగులు నివాళి అర్పించారు. మంగళవారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్ఎల్ పద్మ హాజరై కిరణ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, జయ, వెంకటేష్, పద్మ, రాము, శ్రీనివాస్, విజయ, భారతీ, శ్యామల, లత, లక్ష్మీ, వీణారేణుక పాల్గొన్నారు.

దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలి

లిబర్టీ: ప్రతి పౌరుడు దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలని జేపీసీ చైర్మన్ ఉమాశంకర్ భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షులు కే.వీ.ఎన్.శర్మలు కోరారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని కులాలు, మతాలకు అతీతంగా ప్రతివ్యక్తి పరస్పర సహకారం చేసుకుంటూ.. జీవితం సాగించాలని సూచించారు. వారు మాట్లాడుతూ బైబిల్, ఖురాన్, భగవద్గీతలో ఉన్న సారాంశం ఒక్కటేనని వారు వివరించారు. దైవభక్తి దేశభక్తి మించింది మరోకటి లేదని దైవభక్తితో జీవనం సాగిస్తే ముక్తి మార్గంలో పయనిస్తారన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

చిలకలగూడ : నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. చిలకలగూడ నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కు ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించారు. అసోషియేషన్ చైర్మన్‌గా నాగులూరి సాయిబాబా కొనసాగుతారు. వైస్ ఛైర్మన్ నర్సింహరావు, ప్రెసిడెంట్ గిరిధరబాబు, వైస్ ప్రెసిడెంట్ రాధకృష్ణ శర్మ, జనరల్ సెక్రటరీ తుమ్మ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ డీకే సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రమోద్‌కుమార్, ట్రెజరర్ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, రవిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కును దత్తత తీసుకుని నిర్వహణ బాధ్యతలు స్వీకరించి కొనసాగిస్తున్నామని, జంటనగరాల్లోని పార్కుల నిర్వహణ పోటీల్లో పలు అంశాల్లో అవార్డులు గెలుచుకున్నామన్నారు. నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, వాకర్లు, యోగా అభ్యాసకులు, క్రీడాకారులు, స్థానికులు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.

క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: క్రికెట్ బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా హోర్డింగ్ ఏర్పాటు చేసిన నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని సిటీ సెంట్రల్‌మాల్‌కు ఐఎక్స్ బెట్.ఇన్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఈ హోర్డింగ్ బెట్టింగ్‌లను ప్రోత్సహించేలా ఉండటంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. సిటీ సెంట్రల్ మాల్ మేనేజర్ ఆసిం ముంతాజ్ సిద్ధికీ, కుషీ అడ్వర్టైజింగ్ కంపెనీ సీనియర్ మేనేజర్ ఓలేటి శ్రీనివాసరావులపై ఐపీసీ సెక్షన్ 116, గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగ్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యానికి మించి ఆస్తిపన్ను వసూలు

అంబర్‌పేట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 అధికారులు లక్ష్యం చేరుకున్నారు. ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యానికి మించి వసూలు చేశారు. గత నెల మార్చి 31 గడువు ముగిసేలోపు ఆస్తిపన్నును వసూలు చేసి సికింద్రాబాద్ జోనల్ పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారు. డీఎంసీ మారుతీ దివాకర్ పర్యవేక్షణలో సిబ్బంది పన్ను వసూలును అనుకున్న లక్ష్యానికి మించి వసూలు చేశారు. సర్కిల్-16 కు రూ.53.65 కోట్లు వసూలు లక్ష్యం కాగా.. రూ. 62.11 కోట్లు వసూలు చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ప్రత్యేకంగా తమ సర్కిల్ సిబ్బందిని అభినందించినట్లు డీఎంసీ మంగళవారం తెలిపారు. ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించడంతో చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకున్నారన్నారు.

వస్త్ర ప్రదర్శనకు స్పందన



లాలాపేట: తార్నాక ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కళాసిల్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రకళా ప్రదర్శనకు స్పందన వస్తోందని నిర్వాహకులు తెలిపారు. చేనేత కాటన్ చీరలు, షర్ట్స్, దుస్తులు, రంగు రంగుల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 7 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు.

నెంబర్ ప్లేటు లేని వాహనదారులపై కేసు

లాలాపేట: నెంబర్ ప్లేటు లేని పలువురి ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు నెంబర్ లేకుండా రోడ్లపైకి వస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గత రెండు రోజుల నుంచి ఓ కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు నంబర్ ప్లేటు లేకుండా వెళ్తుండా వారిపై కేసు నమోదు చేశామన్నారు.


జర్నలిస్ట్ రఘు మృతి బాధాకరం

సనత్‌నగర్: అందరితో కలుపుగోలుగా ఉండే జర్నలిస్ట్ రఘు మృతి బాధాకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. రఘు మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘు కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వేసవి నేస్తాలు.. ప్రకృతి వరప్రసాదాలు



కొబ్బరి బోండా తాగుతున్న యువకుడు



మండు వేసవిలో సూర్యుడి ప్రతాపానికి మానవాళి, ప్రాణికోటి విలవిల లాడుతోంది. మండే ఎండలతో ఉపశమనం పొందేందుకు రకరకాల ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఓ వైపు ఉక్కపోత, మరో వైపు వేసవి తాపానికి దాహం, ఎంత నీరు తాగిన తీరని దప్పికలు, ఆగని శరీర అలసట, చెమట ఇలా అనేక తిప్పలు తప్పవు. ఇందులో భాగంగా కొందరు నిమ్మకాయ సోడాలు, ఐస్‌క్రీమ్‌లు,, ఫ్రిడ్జ్‌లలో నిలువ ఉండే లస్సీ, మజ్జిగలకు అలవాటు పడుతుండగా ఆరోగ్యం దృష్ట్యా మరి కొంత మంది ప్రకృతి వరప్రసాదాలు సహజమైన పండ్లు, పండ్ల రసాలవైపు మొగ్గు చూపుతారు. ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడానికి కావాల్సిన పదార్థాలను ప్రకృతి ప్రసాదించింది. ప్రకృతి ప్రసాదించిన ఈ ఉపశమన పదార్థాలు కేవలం వేసవి కాలంలోనే లభిస్తాయి. ఆరోగ్య ప్రదాయినిలుగా ఉన్న కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, బత్తాయి, పుదీనరసం, రాగిజావ, మజ్జిగ, చెరుకు రసాలకు వేసవిలో గిరాకీ పెరుగుతోంది. –లాలాపేట

